రైతుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, అతని వద్ద నుండి ధాన్యం కొనుగోలు చేసేందుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను కోవిడ్ నిబంధనలు పాటిస్తూ మూడు రోజుల్లో సిద్ధం చేసుకోవాలని జిల్లా కలెక్టరు డాక్టర్ ఎ.శరత్ రెవిన్యూ, పౌర సరఫరాలు, మార్కెటింగ్ అధికారులను ఆదేశించారు.

మంగళవారం నాడు ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్‌డిఓలు, తహాశీలుదార్లు, ఎఓ, ఎఇఓ, ప్యాక్స్ సిఇఓలు, మార్కెటింగ్ కమిటీల సెక్రటరీలతో ప్రస్తుత వానాకాలం ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాట్లపై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. గత యాసంగి కాలం కన్నా ఈ వానాకాలం ధాన్యానికి క్వింటాళుకు **53** రూపాయలు పెంచి, క్వింటాళుకు గ్రేడ్ ఎ రకానికి **1888/-**, గ్రేడ్ బి రకానికి **1868/-**ప్రభుత్వం మద్దతు ధర నిర్ణయించిందని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో **337** ధాన్యం కొనుగోలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలుపుతూ పక్కా ప్రణాళికతో కొనుగోలు కేంద్రాలను ఏర్పాట్లను చేయాలని ఆదేశించారు. జిల్లాలో **2** లక్షల **37** వేల ఎకరాలలో దాదాపు **5** లక్షల **92** వేల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి అంచనాగా, దానిలో **4** లక్షల **95** వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం వుందని తెలిపారు. ఒక కోటి **23** లక్షల గన్నీ బ్యాగుల అవసరం వుందని తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావలసిన స్థలం పరిశీలించుకోవాలని, టార్పాలిన్‌లు, తూనిక యంత్రాలు, తేమ కొలిచే యంత్రాలు, పాడీ క్లీనర్స్ ఏర్పాటు చేసుకోవాలని, కేంద్రాలలో తప్పనిసరిగా టెంట్ వసతి, మంచి నీటి వసతి, సబ్బు, శానిటైజర్‌లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. కోవిడ్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, హమాలీలు తప్పనిసరిగా మాస్క్‌లు ధరించాలని, మాస్క్‌లతో, భౌతిక దూరం వుండేలా చూడాలని తెలిపారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు ప, ప్రణాళికబద్ధంగా నిర్వహించాలని, ఏ రైతు ఏ సమయంలో కొనుగోలు కేంద్రానికి ధాన్యంతో రావాలో స్పష్టంగా తెలియచేస్తూ కూపన్‌లు పంపిణీ చేయాలని తెలిపారు. పాస్ బుక్ లేని రైతుల ధాన్యం కొనుగోలు సంబంధించి రైతు సమన్వయ సమితి కోఆర్డినేటరు, ఎఇఓ సమన్వయంతో **50** క్వింటాళ్ల వరకు, **50** క్వింటాళ్లు దాటితే ఎఓ అనుమతించాలని తెలిపారు. ప్రతి మండలానికి నియమించబడిన ముగ్గురు సూపర్‌వైజర్లు తమ పరిధిలోని కేంద్రాల వద్ద క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, ఆర్‌డిఓ, తహాశీలుదార్లు కేంద్రాలను తనిఖీ చేయాలని, వసతుల ఏర్పాట్లను పరిశీలించాలని తెలిపారు. కేంద్రాల వద్ద రద్దీ కలుగకుండా అవసరమున్న చోట సబ్‌సెంటర్ల ఏర్పాటుతో రద్దీని నివారించాలని, ప్రతి కేంద్రానికి సంబంధించి ఇన్‌ఛార్జీ, బుక్ కీపర్, టాబ్ ఆపరేటర్ల పోన్ నెంబర్లతో, వివరాలతో బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ప్రతి సెంటర్‌లో ట్యాబ్ ఆపరేటరు నియమించుకోవాలని, తద్వారా ప్రభుత్వం అందించే డబ్బు రైతుల ఖాతాలో వెంటనే జమ కావడం జరుగుతుందని తెలిపారు. రవాణా ఏర్పాట్లకు సంబంధించి ట్రాన్స్‌పోర్టు వారితో సమావేశం ఏర్పాటు చేసుకొని ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మిల్లుల వరకు చేరవేసే ప్రక్రియను సమీక్షించుకోవాలని తెలిపారు. గత సంవత్సరం ధాన్యం రవాణాను దృష్టిలో వుంచుకొని హమాలీలను పక్కాగా ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కొనుగోలు కేంద్రానికి వచ్చిన ప్రతి రైతు నుండి వెంటనే ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని, ఎలాంటి అలసత్వం, నిర్లక్ష్యం వహించరాదని తెలిపారు.

కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టరు పి.యాదిరెడ్డి, జిల్లా సరఫరాల అధికారి కొండల్‌రావు, డిపిఓ నరేశ్, సహకార శాఖ, మార్కెటింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

---

జిల్లా పౌర సంబంధాల అధికారి, కామారెడ్డి గారిచే జారీ చేయనైనది.